## రూ. 25కోట్ల మద్యం తాగేశారు..



2





2

## చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## తెయూ వీసీని కలిసిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల సంఘం



**అక్షరటుడే, ఇందూరు:** ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య యాదగిరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, మారయ్య గౌడ్, నిషిత రాజు, సూర్యప్రకాష్ రావు, శంకర్, సంజీవ్, శ్రీనివాస్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.







క్యూలో నిలబడిన భక్తులు



## కిక్కిరిసిన ఆలయాలు

నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలు దేవాలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. భక్తుల రద్దీతో ఆయా ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొత్త ఏడాదిలో అంతా మంచి జరగాలని కోరుకుంటూ కుటుంబ సమేతంగా భక్తులు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో భక్తులు నూతన ఏడాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తుల కోసం ఆలయంలో ఏర్పాట్లు చేశారు. అలాగే శంభునిగుడి, చక్రం గుడి, మాధవనగర్ సాయిబాబా ఆలయాలతో పాటు వివిధ పట్టణాల్లోని ప్రధాన ఆలయాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.

- అక్షరటుడే, ఇందూరు



## సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ మేరకు ఆయన సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రముఖులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డి కలిసి న్యూ ఇయర్ విషెస్ తెలియజేశారు.



## ఆర్మూర్ మున్సిపాలిటీలో ఓటర్ జాబితా విడుదల

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ పట్టణ ఏకీకృత జాబితాను విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ పూజారి శ్రావణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టును ఆర్మూర్ మున్సిపాలిటీ కార్యాలయంతోపాటు సబ్ కలెక్టర్, ఎంపీడీవో తహశీల్దార్ కార్యాలయాల నోటీస్‌బోర్డులపై ప్రదర్శిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏమైనా తప్పులు, సవరణలు, మార్పులు చేర్పులు, తొలగింపులు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం అభ్యంతరాలు సమర్పించవచ్చని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పౌరులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆంజనేయులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అద్దె భవనాలకు స్వస్తి!

- సొంత భవనాల్లోకి ప్రభుత్వ కార్యాలయాలు
- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అద్దె భారం తగ్గించుకోవడానికి చర్యలు
- వివరాలు సేకరిస్తున్న అధికారులు





**ప్రభుత్వ కార్యాలయాలు ఇక నుంచి సొంత భవనాల్లోనే కొనసాగనున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆఫీసులను ప్రభుత్వ బిల్డింగ్‌ల్లోకి మార్చాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అద్దె చెల్లింపుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లాల్లోని అద్దె భవనాల సమాచారాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా యంత్రాంగం సమాచారాన్ని సేకరించే పనిలో పడింది. ఇప్పటికే పలు కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చడానికి ఉన్న అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.** - అక్షరటుడే, ఇందూరు

జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే అద్దె ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆఫీసుల వివరాలను సేకరించి అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో నూతనంగా కలెక్టరేట్ నిర్మించారు. దాదాపుగా అన్ని శాఖల కార్యాలయాలను అక్కడికే మార్చారు. కానీ కొన్ని శాఖలు మాత్రం ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటిని కూడా వీలైనంత తొందరగా ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### గురుకులాలకు సొంతగూడు కష్టమే..

సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాలు వసతి గృహాల పరిస్థితిపై తాజా ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొనలేదని కొందరు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాలు దాదాపుగా సొంత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. బీసీ, మైనార్టీ శాఖలో మాత్రం కొన్ని హాస్టళ్లు, గురుకులాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. దీంతో లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఆయా పాఠశాలలు, హాస్టళ్లకు సరిపడే భవనాలు లేవు. దీంతో సొంత భవనాలు నిర్మిస్తేనే కిరాయి ఖర్చులు తగ్గే అవకాశం ఉంది.

### అంగన్‌వాడీలు సైతం..

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అంగన్వాడీలు కూడా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 400 పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు కిరాయి చెల్లిస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాలు సైతం అద్దె భవనాలు కొనసాగడంతో లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. నగరానికి సమీపంలో గల మోపాల్ మండలంలో తహశీల్దార్ కార్యాలయం ఇప్పటికీ కిరాయి భవనంలోనే కొనసాగుతోంది. అలాగే జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఆర్మూర్‌లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం రెంటెడ్ బిల్డింగ్‌లోని కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాల నుంచి మార్చనున్నట్లు తెలిసింది. పాఠశాలలు, హాస్టళ్ల జోలికి వెళ్లకుండా.. ఆఫీసులను మాత్రం ప్రస్తుతం సర్కార్ భవనాల్లోకి మార్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్దె భవనాల్లో కార్యాలయాల్లో కనీస వసతులు లేవు. దీంతో అన్ని వసతులు ఉన్న భవనాల్లోకి మారిస్తే సిబ్బంది, ప్రజలకు సైతం ఇబ్బందులు తప్పనున్నాయి.



## పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు


**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సీపీ సాయిచైతన్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి సీపీకి శుభాకాంక్షలు తెలియజేశారు.



## కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే బిగాల శుభాకాంక్షలు

**అక్షరటుడే, ఇందూరు:** కొత్త సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి న్యూఇయర్ విషెస్ తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## తపస్ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే





**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలో తపస్ ఆధ్వర్యంలో రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో తపస్ భవనానికి స్థలం కోసం ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన తపస్ ఇందూరు జిల్లా అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన చారిలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రామకృష్ణ రెడ్డి, కీర్తి సుదర్శన్, మాజీ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా బాధ్యులు సంజయ్ పాండే, శ్యాం ప్రసాద్, శ్రీకాంత్, రమణ, శివ ప్రసాద్, గోవర్ధన్ పాల్గొన్నారు.



## సీపీకి న్యూఇయర్ విషెస్ తెలిపిన ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు

**అక్షరటుడే, ఇందూరు:** కొత్త ఏడాది సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు సీపీ సాయిచైతన్యను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలో ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతిరావు, సహ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, దాస్, అంతిరెడ్డి రాజిరెడ్డి, దయాకర్ గౌడ్, సుధాకర్ రావు, స్వామిదాస్, క్లబ్ మేనేజర్ సురేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కామారెడ్డిలో 242 డ్రంకన్ డ్రైవ్ కేసులు: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** న్యూ ఇయర్ సందర్భంగా డ్రంకన్ డ్రైవ్‌పై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి జనవరి 1 ఉదయం 5 గంటల వరకు ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో ఎక్కడికక్కడ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నూతన సంవత్సర వేళ మందుబాబులు మద్యం తాగి సంబరాలు చేసుకున్నారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 242 కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. కామారెడ్డి డివిజన్ పరిధిలో 117 కేసులు, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 55 కేసులు, బాన్సువాడ డివిజన్ పరిధిలో 75 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను సైతం సీజ్ చేశామన్నారు. మద్యం తాగి వాహనం నడపడం ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల ప్రాణాలు, ఇతర వ్యక్తుల కుటుంబ సభ్యుల జీవితం ప్రమాదంలో పడుతుందన్నారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వాహనం నడపాలని సూచించారు.



## అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**అక్షరటుడే ఇందూరు:** అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకులు కోరారు. రాష్ట్ర రైతు కమిషన్ డైరెక్టర్ గడుగు గంగాధర్‌కు గురువారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లాసుల వారి విధానం వల్ల తాము నష్టపోతున్నామని, ఎంటీఎస్ విధానాన్ని అమలు చేయాలని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని గడుగు గంగాధర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గిరిరాజ్ కళాశాల అతిథి అధ్యాపకుల ప్రతినిధులు సంతోష్ కుమార్, చంద్రిక, గంగాధర్, రాజేశ్వర్, వసంత్ కుమార్, సతీష్, రాధిక, సమంత, వాని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
గురువారం
1.1.2026
www.aksharatoday.in
AKSHARA TODAY

**నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు జరిగాయి. మందుబాబులు పోటీపడి భారీగా మద్యం కొనుగోలు చేశారు. గడిచిన రెండు రోజుల్లో రూ.25 కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి. నిజామాబాద్ జిల్లాలో 102 వైన్స్‌లు 21 కు పైగా బార్లు ఉన్నాయి.** – అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# రూ.25 కోట్ల మద్యం తాగేశారు..

■ న్యూ ఇయర్ వేడుకల్లో ఆబ్కారీ శాఖకు భారీగా ఆదాయం ■ జోరుగా మద్యం విక్రయాలు
■ ఇటు పోలీస్‌శాఖ విస్తృత తనిఖీలు ■ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 130 మందిపై కేసు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మద్యం విక్రయాలు పెరిగాయి. గతేడాది 23.88 కోట్ల అమ్మకాలు జరుగగా.. ఈ ఏడాది రూ.కోటిపైగా మద్యం విక్రయం ఎక్కువ జరిగింది. కొత్త ఏడాది ప్రారంభం రోజైన గురువారం కూడా మద్య వ్యాపారం జోరుగా జరిగింది. గతేడాది డిసెంబర్ నెలలో రూ.124 కోట్ల వ్యాపారం జరుగగా.. ఈ ఏడాది డిసెంబర్‌లో రూ.165 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 32శాతం అధికంగా మద్యం విక్రయం జరిగింది.

### పంచాయతీ ఎన్నికలు సైతం ఇదేనెలలో..

పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించింది. దీంతో ఈనెల ఎక్సైజ్ శాఖకు కలిసొచ్చినట్లయ్యింది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎక్సైజ్ శాఖ డిసెంబర్ 31న వైన్స్‌లు రాత్రి 12 గంటల వరకు.. బార్లకు అర్ధరాత్రి ఒంటిగంట వరకు తెరిచి ఉంచేందుకు అనుమతినిచ్చింది. డిసెంబర్ 31న బుధవారం రావడం ఎక్సైజ్ శాఖకు కలిసొచ్చింది. ఒకేరోజు రూ.13 కోట్లకు పైగా వ్యాపారం జరిగింది.

### జోరుగా మాంసం విక్రయాలు..

జిల్లాలో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మటన్, చికెన్, చేపలు, ప్రాన్స్‌తో పాటు కోడిగుడ్ల వ్యాపారం కూడా ఎక్కువ జరిగిందని చెప్పవచ్చు. డిసెంబర్ 31న న్యూ ఇయర్ వేడుకల్లో మద్యంతోపాటు నాన్‌వెజ్ ఎక్కువగా తింటుంటారు. జిల్లా కేంద్రంలో ప్రధాన వీధులతో పాటు గల్లీల్లో కూడా చికెన్, మటన్ వంటకాల దుకాణాలు వెలిశాయి. వివిధ రకాల వంటకాలతో వ్యాపారస్తులు తమ కస్టమర్లను ఆకర్షించారు. మొత్తంగా ఈ న్యూ ఇయర్ వేడుకల్లో రూ.6 కోట్ల నుంచి 8 కోట్ల వరకు నాన్‌వెజ్ వ్యాపారం జరిగినట్లు అంచనా.

## డ్రంకన్ డ్రైవ్‌లో 130 మందిపై కేసు



డిసెంబర్ 31 సందర్భంగా రాత్రి వేళలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లతో పాటు నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 130 మందిని పట్టుకున్నాం. అన్ని ప్రాంతాలలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాం. మద్యం సేవించి వాహనాలు నడిపిన 130 మందిపై కేసును నమోదు చేశాం.

– సాయిచైతన్య, సీపీ, నిజామాబాద్

## జిల్లాలో మద్యం అమ్మకాలు పెరిగాయి



న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో మద్యం అమ్మకాలు పెరిగాయి. గతేడాది డిసెంబర్ కంటే ఈ డిసెంబర్ నెలలో 32 శాతం అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు మద్యం అమ్మకాలు రూ.1159.67 కోట్లు జరగక ఈ ఏడాది డిసెంబర్ నుంచి జనవరి వరకు రూ.1230.75 కోట్లు జరిగాయి.

– మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్



## చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై పోలీస్‌శాఖ నిఘా పెట్టింది. ఈ మేరకు చైనామంజా విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండో టౌన్ ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు నగరంలోని రెండో టౌన్ ఎస్సై, తన సిబ్బందితో కలిసి గురువారం నెహ్రూ పార్క్ సమీపంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద తనిఖీలు చేపట్టారు. పతంగుల దుకాణం యజమాని దారుగల్లికి చెందిన మహమ్మద్ రఫీకుద్దీన్ మహమ్మద్ నిషేధిత చైనామాంజాను అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు బాన్సువాడ పట్టణంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు ప్రత్యేక దృష్టి సారించడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొద్ది రోజుల్లోనే స్లాబ్ లెవల్ వరకు చేరుకున్నాయి. నిర్మాణ పనులు బాన్సువాడ వార్డు ఆఫీసర్ అరవింద్, హన్మాండ్లు, లబ్ధిదారులు, టీచర్స్ కాలనీ 13వ వార్డ్ ఇన్‌ఛార్జి మొహమ్మద్ గౌస్ పర్యవేక్షణలో వేగవంతంగా కొనసాగుతున్నాయి.

## కొత్త ఏడాదిలో జిల్లా మరింత పురోగతి సాధించాలి



**అక్షరటుడే, ఇందూరు:** నూతన సంవత్సరంలో జిల్లా అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ఆయా శాఖల అధికారులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అదనపు కలెక్టర్‌కు న్యూ ఇయర్ విషెస్ తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అనుకున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు మరింత కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయా గౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, డీడబ్ల్యూవో రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలంతా రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజలంతా రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని సీపీ సాయిచైతన్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సీపీ కార్యాలయంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో భాగంగా జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి దుర్గాప్రమీల ఆధ్వర్యంలో ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా రోడ్డు భద్రత నియమాలను పక్కాగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) రాం చందర్ రావు, ఉమామహేశ్వరరావు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు బి. శ్రీనివాస్, కిరణ్ కుమార్, నాగలక్ష్మి, అజయ్ కుమార్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ఏసీపీలతో పాటు ట్రాఫిక్ సీఐ ప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు ఏకగ్రతతో బస్సు నడపాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రైవరు బస్సు నడిపే సమయంలో ఏకాగ్రతతో నడపాలని ఆర్మూర్ ఎంవీఐ రాహుల్ కుమార్ సూచించారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా బస్సు నడపాలని, సెల్ మాట్లాడుతూ బస్సు నడపవద్దన్నారు. అటు తర్వాత యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను వి.సుదర్శన్, ఆర్.రాజేందర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, డిపో మేనేజర్ రవికుమార్, డీవీఎస్ చక్రవర్తి, యూత్ అశోక్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



**అక్షరటుడే, ఇందూరు:** డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్లను డీఈవో అశోక్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలయ్య, ఓమాజీ, కమిటీ సభ్యులు పెంటన్న, షేక్ మదర్, శ్రీనివాస్, నాగరాజు, హకీం, బాలరాజు, జనార్దన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు



**అక్షరటుడే, బాన్సువాడ:** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం బాన్సువాడ ఆర్టీసీ డిపోలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై సుహాసిని పాల్గొని ఆర్టీసీ ఉద్యోగులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో జరిగే మరణాల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. అందుకే ప్రతి డ్రైవర్, ఉద్యోగి అత్యంత బాధ్యతతో వాహనాలు నడపాలని ఆమె సూచించారు. సమావేశంలో ఆర్టీసీ డీఎం రవికుమార్, ఎంఎఫ్ కిష్టయ్య, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రాజారాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## క్రిమిసంహారక మందు తిని ఆరు గొర్రెలు మృతి

**అక్షరటుడే, ఇందూరు:** నగర శివారులోని ఖానాపూర్‌లో గురువారం క్రిమి సంహారక మందు తిని ఆరు గొర్రెలు మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామానికి సుమారు 100 గొర్రెలు మేత మేసేందుకు అడవికి వెళ్లాయి. అక్కడ గొల్ల మల్లేష్‌కు చెందిన ఐదు, గొల్ల సుదన్‌కు చెందిన ఓ గొర్రె క్రిమి సంహారక మందు తిని మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి క్రిమిసంహారక మందు తిన్న మిగతా గొర్రెలకు చికిత్స నిర్వహించి కాపాడారు.





## ముదిరాజ్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

**అక్షర్టుడే, గాంధారి:** మండలంలోని ముదిరాజ్ యువజన సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు భట్టు విఠల్, జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజులు, మండల అధ్యక్షుడు రెడ్డి రాజు హాజరయ్యారు. నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. యూత్ పట్టణ అధ్యక్షుడిగా లైని ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా సంఘని నందు, అరిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబా, సలహాదారుడిగా గుర్జాల సతీష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు సంగని బాలయ్య, లైని రమేష్, నీల రవి, సంగని బాబా, అరిగె అంజయ్య పాల్గొన్నారు.

## మద్యంమత్తులో చెరువులో పడి ఒకరి మృతి

**అక్షరటుడే, బాల్కొండ:** మద్యంమత్తులో చెరువులో పడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని వన్నెల్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వన్నెల్ (బి) గ్రామానికి చెందిన కోటగిరి దేవేందర్ (44) మంగళవారం రాత్రి స్థానిక కల్లు దుకాణంలో కల్లు తాగాడు. అనంతరం మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ఊరచెరువులో పడిపోయాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరగగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టును ఢీకొన్న కారు.. యువకుడి దుర్మరణం

**అక్షరటుడే, కామారెడ్డి:** నూతన సంవత్సర వేళ విషాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన గోపు నరేష్ (30) కామారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. నరేష్‌కు ఏడాదిన్నర క్రితమే ప్రస్తుత భిక్కనూరు సర్పంచ్ కూతురితో వివాహం జరిగింది. అయితే నరేష్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నట్టుగా తెలుస్తోంది. న్యూ ఇయర్ సందర్భంగా కామారెడ్డికి వచ్చిన నరేష్ గుమస్తా కాలనీ నుంచి ఇంటికి వెళ్తుండగా కలెక్టరేట్ సమీపంలోని జయశంకర్ కాలనీ వద్దకు రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో నరేష్ ఒక్కడే ఉన్నాడు. అయితే గత కొద్దిరోజులుగా నరేష్ కారు స్టీరింగ్ సరిగా పని చేయడం లేదని సమాచారం. రెండు నెలల క్రితం స్టీరింగ్ రిపేర్ చేయించినా సరిగా చేయకపోవడం వల్ల గురువారం స్టీరింగ్ గట్టిగా పట్టుకోవడం వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

